క్లుప్తంగా

గొల్ల కురుమలను ఆర్థికంగా ఆదుకోవాలి

సైదాపూర్: రెండో విడత గొర్రెల పంపిణీలో రూ. 10 లక్షలకు ఒక యూనిట్ పంపిణీ చేపట్టాలని కురుమ కుల సంఘం మండల అధ్యక్షుడు పెద్ది తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. గొల్లకురమలకు ప్రభుత్వం ఇచ్చే గొర్రెల పంపిణీకి లబ్ధిదారులు వాటా ధనం చెల్లించి, ఐదేండ్లు కావస్తుందని, ప్రభుత్వం కురుమలకు గొర్రెల పంపిణీ చేయాలన్నారు. కురుమలను ఆర్థికంగా ఆదుకోవాలని, ఉపాధి చూపాలని ప్రభుత్వ లక్ష్యం కేవలం 21 గొర్రెలు యూనిట్‌తో లబ్ధిదారుడికి ఉపాధి దొరకడం లేదన్నారు. కనీసం 60 గొర్రెలతో పాటు గొర్రెల పాక, పశుగ్రాసంతో రూ. పది లక్షలకు యూనిట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ధాన్యం కుప్పల పరిశీలన

చొప్పదండి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిచిన ధాన్యం కుప్పలను ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, తహసీల్దార్ అంబటి రజిత, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పట్టణ శివారులో వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ పరిశీలించారు. మండలంలోని కాట్నపల్లి, మల్లన్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాలలో వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను, తడిచిన ధాన్యాన్ని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్, షమీమ్, మనోహర్, రమేశ్‌లు, ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్, ప్రశాంత్ కుమార్‌లు వేర్వేరుగా పరిశీలించారు.

కేబుల్ ఆపరేటర్ల వినతి



వినతిపత్రం అందిస్తున్న కేబుల్ ఆపరేటర్లు

చొప్పదండి: కేబుల్ ఆపరేటర్‌లను సంప్రదించకుండా పెంచిన కేబుల్ డిష్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ మండలంలోని కేబుల్ ఆపరేటర్లు ఆదివారం ఎంఎస్‌వోకు వినతి పత్రం అందించారు. డీటీహెచ్, జియో ఫైబర్లు పెరుగుతన్న సమయంలో ఎవరిని సంప్రదించకుండా పెంచిన ధరలతో వినియోగదారుల సంఖ్య పడిపోయే అవకాశం ఉన్నందున వెంటనే ధరలు తగ్గించాలని ఎన్‌సీఎఫ్ రేటు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మరిమడ్ల రాజిరెడ్డి, ఎస్. రవి, మల్లేశం, రాజేందర్, కుమార స్వామి, శ్రవణ్, కర్ణాకర్, ఎం రవి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కైలాసం



నివాళి అర్పిస్తున్న కైలాసం

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి రాజీరు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతుడి కుమారుడు ఆరెపల్లి క్రాంతి కుమార్‌ను దళిత లేబర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరి కైలాసం పరామర్శించారు. వెంట అలువాల శంకరయ్య, జనగామ జనార్దన్, కండె కర్ణాకర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందిస్తున్న ఆలయ కమిటీ డైరెక్టర్లు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన గుర్ర నర్సవ్వ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను శ్రీ మానసాదేవి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దం తిరుపతిరెడ్డి ఆదివారం పరామర్శించారు. యాభై కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు నగు నూరి శంకర్, అకెన రవీందర్, గడ్డం సుమిత్‌రెడ్డి, ఆడెపు సంతోష్, కూరపాటి రాజయ్య, సందవేని మల్లేశం, గౌడ శ్రీను, అకెన ప్రభాకర్, అకెన శ్రీకాంత్, సదాల లచ్చయ్య, యా లాల భూమయ్య, నాగపూరి రాజయ్య పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?

- అర్ధంతరంగా నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు
- నిధుల మంజూరు లేక పనులు పెండింగ్
- ప్రధాన రోడ్డుపైనే కొనసాగుతున్న దుకాణాలు
- మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసి ఏడాది పూర్తి



అసంపూర్తిగా మార్కెట్ పనులు



సమీకృత మార్కెట్ షెడ్డు

చొప్పదండి: పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలను ఒకో చోట చేర్చి సదుపాయాలను కల్పించేందుకు ఉద్దేశించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పనులు నిలిచిపోయాయి. రూ. రెండు కోట్ల అంచనాలతో పదమూడు నెలల క్రితం చేపట్టిన పనులకు గ్రహణం పట్టుకుంది. నిధుల లేమితో పనులు అర్ధంతరంగా నిలిచిపోగా, ఉన్నతాధికారులు మాత్రం వీడియో కాన్ఫరెన్స్‌లలో వెంటనే పనులు పూర్తి చేసి సమీకృత మార్కెట్‌ను ప్రారంభించాలని సూచిస్తున్నారు. కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయక పోవడంతోనే పనులు నిలిచిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ఈ మార్కెట్ నిర్మాణం కోసం స్థలం ఎంపిక కోసమే అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఆరు నెలలు పట్టడం గమనార్హం.

రోడ్డు పక్కనే దుకాణాలు

చొప్పదండిలోని రాష్ట్ర రహదారిపై ప్రతిరోజు మాంసం అమ్మకాలు, కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో పాటు, పార్కింగ్ సమస్య తలెత్తడంతో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్వీకారం చుట్టింది. మార్కెట్ నిర్మించి దుకాణాలను తరలిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తి చేసినా ప్రధాన రోడ్డుపై ఉన్న వెజ్, నాన్‌వెజ్ దుకాణాలను ఒకే చోటకు తరలించడం సాధ్యమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భూమి కేటాయింపుతోనే వివాదం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రెండెకరాల స్థలాన్ని వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం అధికారులు కేటాయించారు. రూ. రెండు కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గతేడాది మార్చిలో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మార్కెట్ యార్డులో రైతులు ధాన్యం ఆరబోసుకోవడానికి నిర్మించిన షెడ్లను కూడా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కే కేటాయించారు. దీంతో రైతుల నుంచి విమర్శలు వచ్చాయి. రైతులకు ఉపయోగపడే వ్యవసాయ మార్కెట్ యార్డును కుదించడంపై రైతులు సంఘాల నుంచి ఆందోళనలు వచ్చినా అధికారులు మార్కెట్ యార్డు ఆవరణలో రెండెకరాలు కేటాయించి ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ గదుల నిర్మాణం చేపట్టారు. ఇటు దుకాణాల నిర్మాణం పూర్తి కాక, అటు రైతులు ధాన్యం ఆరబోసుకునే అవకాశం లేకుండా పోతోంది.

దూర భారమేనా..

పట్టణంలోని అంగడి బజార్‌లో ప్రతి శుక్రవారం జరిగే వారసంతకు దశాబ్దాలుగా ఆదరణ ఉంది. ప్రధాన రోడ్డు వెంట కూరగాయల దుకాణాల వెలిశాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న వారసంతను కాదని దూరంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ నుంచి దారిని మూసేస్తే డీ86 ఉపకాలువ దగ్గర గల ప్రధాన రోడ్డు నుంచి వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు వెళ్లడం ప్రజలకు దూరభారం కానుంది. వ్యవసాయ మార్కెట్ పశ్చిమ దిశ గేటు నుంచి మాత్రమే సమీకృత మార్కెట్‌కు ప్రవేశం కల్పించే అవకాశం ఉండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకున్న నిర్ణయం ఎంత మేరకు సఫలీకృతమవుతుందో వేచి చూడాల్సిందే.

వివరాలు

అంచనా వ్యయం	రూ. 2 కోట్లు
వెజిటేబుల్ విక్రయ గదులు	60
నాన్‌వెజ్ విక్రయ గదులు	60
కేటాయించిన స్థల విస్తీర్ణం	2 ఎకరాలు
ప్రారంభం	మార్చి, 2022
పూర్తి చేయాల్సింది	అక్టోబర్, 2022

త్వరలో అందుబాటులోకి



సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు చివరి దశలో ఉన్నాయి. షెడ్డు లోపల రాళ్లు బిగించే పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు పూర్తి స్థాయిలో మంజూరు కాగానే పనులు పూర్తి చేయిస్తాం. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– శాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి

నియామకం

గన్నేరువరం: భీమ్ ఆర్మీ గన్నేరువరం మండల అధ్యక్షుడిగా హన్మాజిపల్లె గ్రామానికి చెందిన రాధారం రమేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎలగందుల అనిల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహనీయుల ఆశయాలను అనుగుణంగా బహుజనులను చైతన్యం పరుస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని రమేశ్ తెలిపారు.

చిగురుమామిడి: చిగురుమామిడి మండల భీమ్ ఆర్మీ అధ్యక్షుడిగా చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన మహేశ్‌ను నియమించినట్లు ఎలగందుల అనిల్ తెలిపారు. ఆదివారం చిగురుమామిడిలో మాట్లాడారు. మహనీయుల ఆశయాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామగ్రామాన బహుజనులను చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

తిమ్మాపూర్: భీమ్ ఆర్మీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎల్కతుర్తి గణేష్‌ను నియమించినట్ల ఎలగందుల అనిల్ తెలిపారు. మహనీయుల ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, నియామకానికి సహకరించినవారికి గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యానగర్(కరీంనగర్): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కరీంనగర్ మహిళా కార్పొరేటర్లు గంట కల్యాణి, నక్క పద్మ అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మహిళా చైతన్యసదస్సుకు హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు ఎన్నోరకాలుగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని తమ హక్కులు సాధించుకోవాలన్నారు. మహిళలు ధైర్యంగా అన్నిరంగాల్లో ముందుకెళ్లాలన్నారు. ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సుంచు లతాశ్రీ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు.

బసవేశ్వరుడికి నివాళి



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్



ఇల్లందకుంట: నివాళి అర్పిస్తున్న నాయకులు

చొప్పదండి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బసవ జయంతి నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ చౌరస్తాలో నిర్వహించిన జయంతిలో తహసీల్దార్ అంబటి రజిత, కపిల మల్లికార్జున్, తిక్క శివశంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బసవేశ్వర జయంతిని ఆదివారం లింగబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లింగబలిజ మండల అధ్యక్షుడు గోశెట్టి రమేష్ మాట్లాడుతూ... ఎనిమిది వందల ఏళ్ల క్రితమే సమాజంలో కుల,వర్ణ,లింగ బేధాలు లేవని అందరు సమానమేనని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడని అన్నారు. కార్యక్రమంలో గోశెట్టి సోమశేఖర్, నల్గొండ రవీందర్, కంపేట సదయ్య, గాజుల రాజు, మహేందర్, శ్రీధర్, సుదర్శన్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



చొప్పదండి: పంటను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి



గంగాధర:రైతును ఓదార్చుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలకు భారీ నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. ఆదివారం పంటలను, ధాన్యం రాశులను, కూలిన ఇళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు పరిశీలించారు. చేతికందిన పంటలు నాశనమయ్యాయని, తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం పండించిన పంట తూకంలో కోతలు విధించి రైతులను నిండా ముంచుతున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదని రైతులు వాపోయారు. అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పరిహారం ఇవ్వకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫసల్ బీమా అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ రైతుల నోట్లో మట్టి కొడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి విమర్శించారు. చొప్పదండి మండలంలోని చాకుంటలో పంటలను పరిశీలించారు.జిల్లా వ్యాప్తంగా వడగండ్ల వానతో నష్టం జరిగినా ఉన్నతాధికారులు స్పందించడం లేదన్నారు. అకాల వర్షాలు రైతులకు నష్టం కలిగిస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులు అధైర్య పడొద్దని బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రైతులకు భరోసా ఇచ్చారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడొద్దని రామడుగు మండలంలోని గోపాల్ రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి తెలిపారు.గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. పంట నష్టంపై రైతులు ఎమ్మెల్యేకు వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. పంట నష్టంపై సమగ్ర సర్వే చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలో ధ్వంసమైన పంటలను పరిశీలించారు. శంకరపట్నం మండలంలో అకాల వర్షానికి రోడ్డుపై చెట్లు విరిగిపడి రాకపోకలు నిలిచిపోయాయి.కేశవపట్నం పోలీసులు జేసీబీతో చెట్లను తొలగించారు. మండల వ్యాప్తంగా విద్యుత్‌సంభాలు విరిగిపోయాయి. జమ్మికుంట మున్సిపల్ పరిధి అంబేడ్కర్ కాలనీకి చెందిన పసునూరి ప్రభాకర్ పాడి గేదె ఆదివారం సాయంత్రం పిడుగుపాటుతో మృతి చెందింది.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఇల్లందకుంటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్ : బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను కించ పరిచేవిదంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి, ఈటలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మండల అధ్యక్షుడు రాముల కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రేవంత్‌రెడ్డి దొంగ ప్రమాణం, ఏడుపుతో సానుభూతి పొందాలని చూస్తున్నడని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారుడు ఈటలపై రేవంత్‌రెడ్డి భాష సరికాదని, రాబోయే రోజుల్లో రేవంత్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈటలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, పల్లపు రవి,తిరుపతి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి,ఇటుకాల స్వరూప, మోతే స్వామి, ఎదులపురం అశోక్, రావుల శ్రీనివాస్, గండికోట సమ్మయ్య, ఠాగూర్ రాకేష్,కైలాసకోటి గణేష్, ఇల్లందుల శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి ఖండించారు. మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవడం కోసం రేవంత్‌రెడ్డి ఈటలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మల్యాల సర్పంచ్ సాంబయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎండి.షఫీ,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆంజనేయులు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న స్నేహితులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన శనిగరం ఆంజనేయులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు చిన్ననాటి స్నేహితులు, 2000–01 పదోతరగతి విద్యార్థులు రూ.20వేల ఆర్థికసాయం చేశారు. ఆదివారం మృతుడి ఇంటికి వెళ్లి నగదు అందించారు. కార్యక్రమంలో బొల్లబత్తిని శ్రీనివాస్, పత్తేం శ్రీనివాస్, గందె సంజీవ్, గందం శ్రీనివాస్, చిట్టంపల్లి మహేందర్, కుంట గోపాల్, మెడబోయిన సాంబరాజు, బెజ్జంకి సంపత్, వంతడ్పుల శ్రీనివాస్, గైని శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మొగిలిపాలెం, పర్లపల్లి, రేణికుంట , నల్లగొండ, మక్తపల్లె, కొత్తపల్లి, నుస్తులాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. రైతులకు నష్టం కలగకూడదని సీఎం కేసీఆర్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని, నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఏసీఎస్ అధికారులకు సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, మిల్లర్లు ఇబ్బందులు పెడితే నేరుగా గాని స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్‌రెడ్డి, సర్పంచులు భాగ్యలక్ష్మి, గణమ్మ,శోభ, కొమురయ్య, భారతి, ఎంపీటీసీలు రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: మండలంలోని చాకుంట ఎక్స్ రోడ్డులో కాంగ్రెస్ నాయకులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. వడగండ్ల వాన, ఈదురు గాలులకు రాలిని మామిడి, వరి, మిర్చి పంటలకు వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ వరంగల్, రాయపట్నం రహదారిపై బైఠాయించారు. పోలీసులు రంగ ప్రవేశంచేసి ఆందోళన విరమింపజేశారు. ఆందోళనలో పురం రాజేశం, ముద్దసాని రంగన్న, ముద్దం తిరుపతిగౌడ్, మావురం రాములు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-1991 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాఠశాల తీపిగుర్తులను పంచుకుంటూ ఆనందంగా గడిపారు.

ఆధ్యాత్మికం

వైభవంగా పోచమ్మ బోనాలు



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి దాదాపు రెండు వందల గౌడకుల మహిళలు పోచమ్మ తల్లి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలను సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా పూజలు చేశారు.

జీయర్‌స్వామి రథోత్సవం



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో జీయర్‌స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మాలధారణతో ప్రశాంతత

ఇల్లందకుంట: మాలధారణతో ప్రశాంతత పొందుతారని అచల బోధనంద తిరుపతాచార్యులు, విమల విజ్ఞానసంద లింగమూర్తచార్యులు అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరాములపల్లిలో గురుదయానందకస్తూరి రంబాయమ సమేత నిష్కల్మశానంద రాజమార్యులు పూజా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సృష్టిలో మనిషి మాత్రమే భావవ్యక్తీకరణ చేయగలడని, తనకంటూ గురువుని ఎన్నుకుంటాడని గురువు చెప్పిన విధంగా నడుచుకున్నప్పుడే దేనినైనా ఏకాగ్రతతో సాధించగలడని, గుడిలో చేసే పూజాది కార్యక్రమాలు మనిషికి ప్రశాంతతనిస్తే నదిలో చేసే స్నానాలు శరీర రుగ్మతను తొలగిస్తాయన్నారు. మాలధారణతో పంచభూతాలు మనిషిలో ఇమిడి ఉంటాయని వాటిని అదుపులో పెట్టుకొని ముక్తిని పొందాలన్నారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, సర్పంచ్ మొగిలి,నిత్యానంద పకిడే రాజేశ్వరార్యులు, ఒడిశా,ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్రకు చెందిన భక్తులు పాల్గొన్నారు.